క్లుప్తంగా

నాణ్యమైన వైద్యసేవలందించండి



చిలమత్తూరు పీహెచ్‌సీ వద్ద డీఎంహెచ్‌ఓ షైరోజాబేగం

చిలమత్తూరు: జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారిణి షైరోజాబేగం శుక్రవారం సాయంత్రం చిలమత్తూరు పీహెచ్‌సీని తనిఖీ చేశారు. పీహెచ్‌సీలో రికార్డులను పరిశీలించారు. రోగుల వివరాలను ఎప్పటికప్పుడు నమోదు చేయాలని, వాటిని ఆన్‌లైన్ చేసి ఈహెచ్‌ఆర్, ఎబీహెచ్ ఏఐడీలు తప్పక పూర్తి చేయాలన్నారు. ఆస్పత్రికి వచ్చే రోగులకు నాణ్యమైన వైద్యసేవలు అందించాలన్నారు. ప్రభుత్వ ఆస్పత్రుల్లోనే కాన్పులు నిర్వహించేలా చర్యలు చేపట్టాలన్నారు. వాతావరణ మార్పుల వల్ల సంభవించే వ్యాధులు, నివారణ చర్యలుపై ఆరోగ్య కార్యకర్తలు అవగాహన కల్పించాలని సూచించారు. కార్యక్రమంలో వైద్యాధికారులు డా.రామకృష్ణ, డా. తేజశ్విని, సీహెచ్‌ఓ జయచంద్ర, స్టాఫ్ నర్సు జ్యోతి తదితరులు పాల్గొన్నారు.

మున్సిపల్ కమిషనర్‌గా మల్లికార్జున



చిలమత్తూరు: హిందూపురం మున్సిపల్ కమిషనర్‌గా మల్లికార్జున శుక్రవారం బాధ్యతలు చేపట్టారు. ఆయన మాట్లాడుతూ మున్సిపాలిటీలో నెలకొన్న ప్రధాన సమస్యలపై దృష్టి సారించి పరిష్కారం దిశగా చర్యలు చేపడతామన్నారు. కాగా ఇక్కడ మున్సిపల్ కమిషనర్‌గా పనిచేసిన సంగం శ్రీనివాసులును మాతృసంస్థ సెర్ఫ్‌కు బదిలీ చేసిన విషయం విదితమే.

మడకశిర మున్సిపల్ కమిషనర్‌గా జగన్నాథ్



మడకశిర: మడకశిర నూతన మున్సిపల్ కమిషనర్‌గా జగన్నాథ్ శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మడకశిర మున్సిపాలిటీ అభివృద్ధికి అవసరమైన చర్యలు తీసుకుంటామన్నారు. ఇదిలా ఉండగా ఆయన బాధ్యతలు స్వీకరించిన వెంటనే పట్టణంలోని అన్నా క్యాంటీన్‌ను పరిశీలించారు. ఆయన వెంట మున్సిపల్ ఏఈ మురళీ ఉన్నారు.

యథా స్థానంలో పూల మండీలు

పావగడ: స్థానిక మున్సిపల్ బస్టాండ్ సమీపంలో యథాస్థానంలోనే పూల మండీలను ఏర్పాటు చేశారు. కొద్ది రోజుల క్రితం పూల మండీలను వేరే ప్రాంతానికి మార్చినా స్థానిక ఎమ్మెల్యే హెచ్‌వీ వెంకటేష్ సూచనతో పూల మండీలను మళ్లీ యథాస్థానంలో నిర్వహించేలా చర్యలు చేపట్టారు. పూల మండీల మార్పుపై రైతు కర్ణాటక రాజ్య రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు పూజారప్ప హర్షం ప్రకటించారు. ఇదిలా ఉండగా శుక్రవారం ఉదయం ఆందోళన చేపడుతున్న పూల వ్యాపారులతో స్థానిక మున్సిపల్ ఆరోగ్యాధికారి షంషు చర్చలు జరిపారు.

కేసుల రాజీకి సహకరించండి



మాట్లాడుతున్న న్యాయమూర్తి బొజ్జప్ప

పెనుకొండ: వచ్చే నెల 5న పెనుకొండ కోర్టులో జరిగే జాతీయ మెగా లోక్ అదాలత్‌లో కేసులు రాజీ చేయడానికి పోలీసులు సహకరించాలని న్యాయమూర్తి బొజ్జప్ప పేర్కొన్నారు. జాతీయ మెగా లోక్ అదాలత్‌కు సంబంధించి శుక్రవారం న్యాయమూర్తి వివిధస్టేషన్ల పోలీసులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కక్షిదారులతో మాట్లాడి రాజీ పూర్వకంగా అధిక కేసులు పరిష్కరించడానికి తగిన చర్యలు తీసుకోవాలని సూచించారు.

మహాలక్ష్మీదేవికి పూజలు

రొళ్ల: రత్నగిరిలో వెలసిన కొల్హాపురి మహాలక్ష్మీదేవికి శుక్రవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. వేకువజామున అమ్మవారి మూల విగ్రహంతో పాటు ఉత్సవ విగ్రహానికి అభిషేకం, అంకురార్పణ, కుంకుమార్చన తదితర పూజలు చేశారు. భక్తులు పెద్ద సంఖ్యలో అమ్మవారిని దర్శించుకొని మొక్కులు చెల్లించుకున్నారు.

వళ్లూరు అధ్యక్షురాలిగా కవిత

పావగడ: తాలూకాలోని వళ్లూరు గ్రామ పంచాయతీ అధ్యక్షురాలిగా క్యాతగానచెర్లు గ్రామానికి చెందిన కాంగ్రెస్ మద్దతుదారురాలు కే ఓ కవిత ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. గ్రామ పంచాయతీ కార్యాలయంలో గ్రామ పంచాయతీ అధ్యక్ష స్థానానికి శుక్రవారం జరిగిన ఎన్నికల్లో ఆమె ఒక్కరే నామినేషన్ దాఖలు చేయడంతో ఎలాంటి పోటీ లేకుండా ఏకగ్రీవంగా ఎన్నికై నట్లు ఎన్నికల అధికారి తహసీల్దార్ వరదరాజు అధికారికంగా ప్రకటించారు.

గోకులం బిల్లులిచ్చేదెన్నడో ?

- ఆర్భాటంగా పశువుల షెడ్ల నిర్మాణం
- ఆరు నెలలు గడుస్తున్నా అందని బిల్లులు
- ఆందోళనలో పాడి రైతులు



రొద్దంలో నిర్మించిన గోకులం షెడ్డు

రొద్దం: అధికారం వచ్చిన వెంటనే కూటమి ప్రభుత్వం గోకులం షెడ్ల ఏర్పాటుకు పచ్చ జెండా ఊపింది. చెప్పింది తడవుగా గ్రామాల్లో రైతులు షెడ్లు నిర్మించుకున్నారు. అయితే.. గొకులం, మినీ గోకులం పథకాల కింద పశువులు షెడ్లు నిర్మించుకున్న పాడి రైతులు బిల్లులు కోసం కళ్లు కాయలు కాచేలా నిరీక్షిస్తున్నారు. షెడ్లు నిర్మించుకుని ఆరు నెలలు గడుస్తున్నా బిల్లులు రాకపోవడంతో ఇంకెప్పుడు వస్తాయోనని ఆందోళన చెందుతున్నారు. ప్రభుత్వం రాయితీ ఇస్తుందని ముందుకొచ్చి అప్పులు చేసి మరీ షెడ్లు నిర్మించుకున్నా వారి ఆశలు అడియాశలవుతున్నాయి. షెడ్డు నిర్మాణానికి రూ. లక్షలు ఖర్చు చేసినా నేటికీ బిల్లులు అందలేదని లబ్ధిదారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఎప్పుడొస్తాయో కూడా తెలియని పరిస్థితి, అప్పులు చేసి నిర్మించుకున్నామని ఇంత వరకూ బిల్లులే రాకపోవడంతో ఏమి చేయాలో దిక్కుతోచడం లేదని పాడి రైతులు వాపోతున్నారు.

250 షెడ్ల దాకా నిర్మాణం

పెనుకొండ నియోజకవర్గంలోని ఐదు మండలాల్లో దాదాపు 285 గోకులం షెడ్లు మంజూరయ్యాయి. అందులో దాదాపు 250 షెడ్లు దాకా రైతులు నిర్మించుకున్నారు. రొద్దం మండలంలో 50 గోకులం షెడ్లు నిర్మించుకున్నారు. సోమందేపల్లి 50, పరిగి 50, గోరంట్ల 65, పెనుకొండ 70 పూర్తయ్యాయి. అయితే నెలలు గడచిపోతున్నా బిల్లులు మాత్రం రాకపోవడంతో రైతులు ఇబ్బందులు పడుతున్నారు.

రైతులపై చిన్నచూపా...

ఎన్నికల ముందు అన్నదాత సుఖీభవ పథకం కింద ఏటా ప్రతి రైతుకు రూ.20 వేలు పెట్టుబడి సాయం అందజేస్తామని హామీ ఇచ్చారు. ఏడాది దాటినా ఇంత వరకూ అన్నదాత సుఖీభవ ద్వారా రైతులకు నయాపైసా లబ్ధి చేరకూర లేదని రైతులు వాపోతున్నారు. పండించిన పంటకు గిట్టుబాటు ధరల్లేక అల్లాడిపోతున్నారు. దీనికి తోడు ఆర్‌బీకేలను నిర్వీర్యం చేయడం అన్నదాతలు అన్ని విధాలా ఇబ్బందులు పడుతున్నారు. రైతులకు ఏదో చేస్తున్నామని గొప్పులు చెప్పుకునేందుకు గోకులం షెడ్లు మంజూరు చేసి చేతులు దులుపుకున్నారని, ఇప్పుడు బిల్లులు ఇవ్వకుండా ఇబ్బందులు గురి చేస్తున్నారని రైతులు వాపోతున్నారు. బిల్లుల కోసం సంబంధిత అధికారులు, కార్యాలయాల చుట్టూ తిరగుతున్నామని, అధికారులు మాత్రం అదిగో వస్తాయి..ఇదిగో వస్తాయని చెబుతూనే ఉన్నారంటున్నారు.

ఆందోళన అవసరం లేదు

గోకులం షెడ్లు నిర్మించుకున్న రైతులు ఆందోళన చెందాల్సిన పనిలేదు. ఇప్పటికే మండలంలో గోకులం షెడ్లకు సంబంధించి బిల్లులు అప్‌లోడ్ చేశాము. ప్రభుత్వం రెండు మూడు రోజుల్లో గోకులం షెడ్లకు సంబంధించి బిల్లులను చేసే అవకాశం ఉంది.

– రామ్‌కుమార్, ఎంపీడీఓ, రొద్దం

తల్లిదండ్రులను చూసుకోవాల్సిన బాధ్యత బిడ్డలదే..



మాట్లాడుతున్న న్యాయమూర్తి వెంకటేశ్వర్లునాయక్

హిందూపురం: కుటుంబ సభ్యుల ఆదరణకు దూరమై అనాథాశ్రమాల్లో తలదాచుకుంటున్న వృద్ధులను ప్రేమాభిమానాలతో ఆదరించాలని స్థానిక సీనియర్ సివిల్ జడ్జి వెంకటేశ్వర్లునాయక్ సూచించారు. శుక్రవారం పట్టణంలోని మోడల్ కాలనీలో నూతనంగా ఏర్పాటైన ప్రణమ్ అనాథాశ్రమంలో న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా న్యాయమూర్తి మాట్లాడుతూ అనాథలను ఆదరించి వారికి యోగక్షేమాలు చూడటం మానవ ధర్మమన్నారు. బిడ్డలు.. తల్లిదండ్రులను వృద్ధాప్యంలో వీధుల పాలు చేయడం పాపమన్నారు. ఈ పరిస్థితి తిరిగి తమ దాకా వస్తుందని వారు గ్రహించాలన్నారు. అనాథ ఆశ్రమంలోని వృద్ధులు, అనాథ చిన్నారులకు ఏమైనా సమస్యలు ఉంటే లిఖితపూర్వకంగా మండల న్యాయ సేవ అధికారి సంస్థలో ఫిర్యాదు చేస్తే నోటీసులు పంపి తగిన చర్యలు తీసుకుంటామన్నారు. సమావేశంలో ప్రభుత్వ న్యాయవాది జి.శ్రీనివాస్‌రెడ్డి, అనాథ ఆశ్రమ నిర్వాహకులు ఆదిత్య, చంద్రాయుడు, లోక్‌అదాలత్ సిబ్బంది హేమావతి తదితరులు పాల్గొన్నారు

'సుప్రీం' తీర్పు కూటమికి చెంపపెట్టు

- 'సాక్షి'పై అనవసరంగా దుష్ప్రచారం చేశారు
- కార్యాలయాలపై దాడులు చేసిన వారిపై కేసులు పెట్టాలి
- వైఎస్సార్‌సీపీ సమన్వయకర్తలు దీపిక, ఈరలక్కప్ప



టీఎస్ దీపిక



ఈరలక్కప్ప

మడకశిర: సీనియర్ జర్నలిస్ట్ కొమ్మినేని శ్రీనివాసరావు కేసులో సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పు కూటమి ప్రభుత్వానికి చెంప పెట్టులాంటిదని వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త ఈరలక్కప్ప అన్నారు. ఆయన శుక్రవారం 'సాక్షి'తో మాట్లాడుతూ సాక్షి డిబేట్‌లో విశ్లేషకుడు మాట్లాడిన మాటలను సాక్షి పత్రికకు అంటగట్టి ఎల్లో మీడియా, కూటమి నాయకులు పత్రికపై దుష్ప్రచారం చేశారని ఆరోపించారు. సుప్రీంకోర్టు తీర్పుతో సాక్షి పత్రికకు, యాంకర్ కొమ్మినేని శ్రీనివాసరావుకు విశ్లేషకుడు మాట్లాడిన మాటలకు సంబంధం లేదని రుజువైందని స్పష్టం చేశారు. అంతేకాకుండా కొమ్మినేని శ్రీనివాసరావు అరెస్ట్ అక్రమమని సుప్రీంకోర్టు తేల్చి వెంటనే విడుదల చేయాలని ఆదేశాలు కూడా జారీ చేసిందన్నారు. సాక్షి పత్రికపై కూటమి నాయకులు, ఎల్లోమీడియా చేసిన దుష్ప్రచారం అబద్ధమని సుప్రీం తీర్పుతో తేలిందని స్పష్టం చేశారు. చంద్రబాబు అండ్ కో సాక్షి గొంతు నొక్కడానికి చేసే ప్రయత్నాలు ఏవీ కూడా సఫలం కావన్నారు. సుప్రీంకోర్టు తీర్పుతో నైనా చంద్రబాబు బుద్ధి తెచ్చుకోవాలని హితవు పలికారు. కొమ్మినేని శ్రీనివాసరావుకు బెయిల్ రావడం హర్షణీయమన్నారు. సాక్షి కార్యాలయాలపై దాడులు చేసిన పచ్చ మూకలపై కేసులు నమోదు చేసే విధంగా సుప్రీంకోర్టు ఆదేశాలిచ్చి పత్రికా స్వేచ్ఛను కాపాడాలని అభ్యర్థించారు.

చిలమత్తూరు: సాక్షి టీవీ డిబేట్‌లో కృష్ణంరాజు అనే జర్నలిస్టు వ్యాఖ్యలను సాక్షికి ఆపాదిస్తూ సాక్షి కార్యాలయాల దగ్గర పచ్చమూకలు నానా రభస చేశాయని వైఎస్సార్‌సీపీ హిందూపురం సమన్వయకర్త టీఎస్ దీపిక అన్నారు. ఇందులో భాగంగానే సీనియర్ జర్నలిస్టు కొమ్మినేని శ్రీనివాసరావును అక్రమంగా అరెస్టు చేశారని తెలిపారు. అయితే డిబేట్‌లో కృష్ణంరాజు చేసిన వ్యాఖ్యలకు సాక్షి మీడియాకు, అలాగే కొమ్మినేనికి సంబంధం లేదు. వెంటనే కొమ్మినేనిని విడుదల చేయాలని సుప్రీం కోర్టు తాజాగా ఇచ్చిన తీర్పు కూటమి ప్రభుత్వానికి చెంప పెట్టులాంటిదన్నారు. కొమ్మినేని శ్రీనివాసరావుపై అక్రమంగా కేసు బనాయించి ఆయన్ను జైలుకు పంపేలా సీఎం చంద్రబాబు, ఆయన తనయుడు లోకేష్ చేసిన ప్రయత్నాలు సుప్రీం కోర్టు తీర్పుతో పటాపంచలయ్యాయన్నారు. అన్యాయంగా 70 ఏళ్ల వయసున్న వ్యక్తిని వేధింపులకు, బెదిరింపులకు గురిచేయాలనుకోవడం ప్రజాస్వామ్యానికి విరుద్ధమన్నారు. కూటమి ప్రభుత్వంలో వైఎస్సార్‌సీపీ నాయకులు, ఉద్యోగులు, జర్నలిస్టులు, న్యాయవాదులకు రక్షణ లేకుండా పోయిందన్నారు. ప్రశ్నిస్తే అక్రమ కేసులు పెట్టించడం, రౌడీ మూకల ద్వారా బెదిరింపులకు దిగడం విష సంస్కృతికి బీజం వేసినట్టే అని స్పష్టం చేశారు. అమరావతి మహిళల గురించి కృష్ణంరాజు అనే జర్నలిస్ట్ వ్యాఖ్యలను సాక్షి యాజమాన్యం కూడా ఖండించి క్షమాపణలు కూడా కోరిందని గుర్తు చేశారు. కూటమి చేస్తున్న అక్రమాలను ప్రశ్నిస్తున్న సాక్షిపై సీఎం చంద్రబాబు విషం చిమ్మి సాక్షి కార్యాలయాలపై దాడులు చేయించారన్నారు. ప్రజాస్వామ్యంలో ఎప్పటికైనా న్యాయం గెలుస్తుందని సుప్రీం తీర్పుతో మరోసారి స్పష్టమైందని పేర్కొన్నారు.

'తల్లికి వందనం'లో కోత విధించడం సరికాదు

హిందూపురం: 'అర్హత కలిగిన ప్రతి విద్యార్థికి తల్లికి వందనం పథకాన్ని వర్తింపజేసి వారి ఖాతాలో కూడా నగదు జమ చేయాలి. అలాగే మాట ఇచ్చిన ప్రకారం రూ.15 వేలు వేయాలి. రూ.2 వేలు కోత విధించడం సరికాదు'. అని పీడీఎస్‌యూ జిల్లా అధ్యక్షుడు బాబావలి అన్నారు. శుక్రవారం ఆయన మాట్లాడుతూ వెంటనే రూ.2 వేలు లబ్ధిదారుల ఖాతాల్లో జమ చేయాలని, లేకపోతే ప్రభుత్వం చేస్తున్న మోసాన్ని నిలదీస్తూ పెద్ద ఎత్తున రాష్ట్ర వ్యాప్తంగా ఉద్యమిస్తామన్నారు.

నిబంధనల పేరిట కోతలు సరికాదు

హిందూపురం: రాష్ట్ర ప్రభుత్వం తల్లికి వందనం పథకం అమలులో నిబంధనల పేరిట ప్రతి తల్లి ఖాతా నుంచి రూ.2 వేలు కోత విధించడం సరికాదని ఎస్ఎఫ్ఐ నాయకులు విమర్శించారు. స్థానిక అంబేడ్కర్ సర్కిల్‌లో ఎస్ఎఫ్ఐ నాయకులు నిరసన వ్యక్తం చేశారు. ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు ఈరేష్ మాట్లాడుతూ అర్హులైన ప్రతి విద్యార్థికి తల్లికి వందనం వర్తింపజేయాలన్నారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ కన్వీనర్ అఫ్రీది, కో కన్వీనర్ అజ్మల్, నాయకులు ఉమేష్, జూబెర్ తదితరులు పాల్గొన్నారు.

తప్పిన ప్రమాదం

మడకశిర: పట్టణంలోని పోలీస్ అమరవీరుల స్మారక పార్కు వద్ద శుక్రవారం తృటిలో ప్రమాదం తప్పింది. ఓ బొలెరో వాహనం అదుపు తప్పి పార్కు గోడను వేగంగా ఢీ కొంది. ఈ ఘటనలో పార్కు గోడ, వాహనం పాక్షికంగా దెబ్బతిన్నాయి. అయితే ఈ ఘటనలో ఎలాంటి ప్రాణ నష్టం జరగలేదు.

అంగన్‌వాడీ కేంద్రంలో చేర్పించండి

మడకశిరరూరల్: మండల పరిధిలోని గుర్రపుకొండ అంగన్‌వాడీ కేంద్రం-2లో శుక్రవారం పంచాయతీ స్థాయి గ్రాడ్యుయేషన్ డే కార్యక్రమాన్ని నిర్వహించారు. అంగన్‌వాడీ కేంద్రంలోని పిల్లలను ప్రభుత్వ పాఠశాలలో 1వ తరగతికి చేర్పించారు. అనంతరం ఐదేళ్లలోపు పిల్లలను అంగన్‌వాడీ కేంద్రంలో చేర్పించాలని అవగాహన ర్యాలీ నిర్వహించారు. సీడీపీఓ నాగమల్లేశ్వరి , సూపర్ వైజర్ లీలావతి పాల్గొన్నారు.

తల్లికి వందనం సరిచూసుకోండి

అమరాపురం: మండలంలోని వివిధ పాఠశాలలో తల్లికి వందనం పథకం కింద విద్యార్థుల తల్లుల ఖాతాల్లో నగదు పడేలా ప్రతి ఒక్కరూ చర్యలు తీసుకోవాలని ఎంఈఓ రాఘవయ్య సూచించారు. స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో ఆయన హెచ్‌ఎంలతో సమావేశమయ్యారు. తల్లికి వందనం పథకంలో పొరపాట్లు ఉంటే సరిచేసి పంపాలన్నారు.

చదువుతోనే బాల కార్మికుల నిర్మూలన

పావగడ: చదువుతోనే బాల కార్మికుల నిర్మూలన సాధ్యమవుతుందని స్థానిక ప్రభుత్వ పీయూ కళాశాల వైస్ ప్రిన్సిపాల్ లక్ష్మీనరసమ్మ తెలిపారు. పట్టణంలోని ప్రభుత్వ పీయూ కళాశాలలో శుక్రవారం నిర్వహించిన విశ్వ బాల కార్మిక నిర్మూలన దినోత్సవంలో ఆమె పాల్గొన్నారు. ఈ సందర్భంగా విద్యార్థుల చేత ప్రతిజ్ఞ చేయించారు. తల్లితండ్రుల వెంట కూలి పనులకు వెళ్లే పిల్లలను సైతం పాఠశాలలో చేర్పించే బాధ్యత అందరిపైన ఉందని తెలిపారు. ఉపాధ్యాయులు నాగప్ప, నాగరాజు, నటరాజ్, గోపాల్, సుబ్బరాయప్ప, లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

రక్తదానం.. మరొకరికి ప్రాణదానం



రక్తదానం ఆవశ్యకతపై పోస్టర్లు విడుదల చేస్తున్న అధికారులు

హిందూపురం: రక్తదానంతో మరొకరికి ప్రాణదానం చేసే గొప్ప అవకాశం దొరుకుతుందని డీసీహెచ్ మధుసూదన్, ఎంపీడీఓ సరస్వతీ అన్నారు. ఆంధ్రప్రదేశ్ స్టేట్ ఎయిడ్స్ కంట్రోల్ సొసైటీ ఆధ్వర్యంలో శుక్రవారం జిల్లా ఆస్పత్రి ఆవరణంలో ప్రపంచ రక్తదాతల దినోత్సవాన్ని పురస్కరించుకొని రక్తదానంపై అవగాహన, రక్తదాన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా 55 మంది స్వచ్ఛందంగా రక్తదానం చేశారు. రక్తదానం ఆవశ్యకతపై కరపత్రాలు, పోస్టర్లు విడుదల చేశారు. కార్యక్రమంలో హాస్పిటల్ సూపరింటెండెంట్ లింగన్న, జిల్లా డీఎల్‌ఏటీఓ తిప్పయ్య, దిశ క్లస్టర్ ప్రోగ్రాం మేనేజర్ వెంకటరత్నం, ప్రభుత్వాస్పత్రి సూపరింటెండెంట్ లింగన్న, మెడికల్ ఆఫీసర్ చరణ్ కుమార్, డిప్యూటీ తహసీల్దార్ మైనుద్దీన్ తదితరులు పాల్గొన్నారు.

సవిత.. అహంకార ధోరణి మార్చుకో..

- వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షురాలు ఉషశ్రీచరణ్



వైఎస్సార్‌సీపీ శ్రేణుల మధ్య కేక్‌కట్ చేస్తున్న మాజీ మంత్రి ఉషశ్రీచరణ్

పెనుకొండ రూరల్: రాష్ట్ర బీసీ సంక్షేమశాఖ మంత్రి సవిత అహంకార ధోరణి ప్రదర్శిస్తున్నారు. ఆ పద్ధతిని మార్చుకోవాలి అని వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షురాలు ఉషశ్రీచరణ్ హితవు పలికారు. శుక్రవారం నగర పంచాయతీ పరిధిలోని 20వ వార్డులో 'కాఫీ విత్ వైఎస్సార్‌సీపీ' కార్యక్రమంలో ఆమె పాల్గొన్నారు. పార్టీ కార్యకర్తలు, అభిమానులు జిల్లా అధ్యక్షురాలికి ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా వార్డులో ఇంటింటికీ వెళ్లి సమస్యలను తెలుసుకున్నారు. ఈ సందర్భంగా మాజీ మంత్రి ఉషశ్రీచరణ్ మాట్లాడుతూ మంత్రి సవిత వ్యవహార శైలిలో మార్పు రావాలన్నారు. ఇటీవల రెవెన్యూ అధికారులతో మంత్రి ప్రవర్తించిన తీరు బాగో లేదని చెప్పారు. ప్రభుత్వ కార్యక్రమంలో పాల్గొన్న మంత్రి సవితకు ప్రోటోకాల్ ప్రకారం రెవెన్యూ అధికారులు పూల బొకే ఇచ్చి స్వాగతించారని పేర్కొన్నారు. అయితే మంత్రి దురుసుగా ప్రవర్తించడంతో పాటు ఆ బొకేను వెనక్కి విసిరేయడం సరికాదన్నారు. అధికారులకు క్షమాపణ చెప్పాల్సింది పోయి అదే రెవెన్యూ అధికారులతో తప్పు జరగలేదు అని వివరణ ఇప్పించడం శోచనీయమన్నారు. గ్రాఫిక్స్ అని మాట మార్చారని, మంత్రి వేగంగా విసిరిన బొకే గన్‌మెన్లను దాటి వెళ్లిందని స్పష్టంగా కనిపిస్తోందన్నారు. అది గ్రాఫిక్స్ ఎలా అవుతుందని ప్రశ్నించారు. ఇంతటి అహంకార ధోరణి సరికాదన్నారు. ప్రజలు అవకాశం ఇచ్చింది వారికి మంచి చేయడానికేనని, అధికారులపై దురుసుగా ప్రవర్తించేందుకు కాదన్నారు. ఇక ముందు అధికారులను అగౌరవ పరిస్తే ఆందోళన చేస్తామన్నారు.

ప్రతి కార్యకర్తకు అండగా ఉంటాం

ఏ కష్టం వచ్చినా వైఎస్సార్‌సీపీ కార్యకర్తలకు అండగా పార్టీ అండగా ఉంటుందని మాజీ మంత్రి ఉషశ్రీచరణ్ పేర్కొన్నారు. సూపర్ సిక్స్ అంటూ అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం పథకాల అమలులో విఫలమైందన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ పట్టణ కన్వీనర్ నరసింహులు, వైఎస్సార్ నగర పంచాయతీ పట్టణ అధ్యక్షుడు కొండల రాయుడు, మాజీ సింగిల్ విండో అధ్యక్షుడు సల్లా సూర్య ప్రకాశ్‌రెడ్డి, కౌన్సిలర్లు యాసిన్, శేషాద్రి, నాయకులు ప్రభాకర్‌రెడ్డి, శ్రీరాములు, గోపాల్, ఆంజనేయులు, సోమందేపల్లి జెడ్పీటీసీ సభ్యుడు అశోక్, మండల కన్వీనర్ గజేంద్ర, నాగినాయన చెరువు సర్పంచ్ అంజినాయక్, కృష్ణారెడ్డి, రజనీకాంత్‌రెడ్డి, పూజారెడ్డి, సందీప్, మురళీ, ప్రవీణ్‌కుమార్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కంచిసముద్రంలో కార్డెన్‌సెర్చ్



ప్రజలకు సూచనలు చేస్తున్న సీఐ జనార్దన్

లేపాక్షి: గ్రామీణా ప్రాంతాల్లో శాంతి భద్రతలకు ఎవరైనా విఘాతం కలిగిస్తే కఠిన చర్యలు తప్పవని హిందూపురం రూరల్ సీఐ జనార్దన్ పేర్కొన్నారు. శుక్రవారం ఉదయం మండలంలోని కంచిసముద్రంలో పోలీసులు కార్డెన్ సెర్చ్ నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ మహిళా సంరక్షణ, రోడ్డు భద్రత, సైబర్ నేరాలు, బాల్యవివాహాలు తదితర అంశాలపై ప్రజలపై ప్రజలకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఎస్ఐ నరేంద్ర, ఏఎస్ఐ షర్ఫుద్దీన్, పోలీసులు, ప్రజలు పాల్గొన్నారు.

మౌలిక సదుపాయాల కల్పనకు చర్యలు

అగళి: మండల కేంద్రంలోని మోడల్ స్కూల్ హాస్టల్‌ను శుక్రవారం సర్వ శిక్ష అభియాన్ డిప్యూటీ ఇంజనీర్ చిదంబరం పరిశీలించారు. అనంతరం మోడల్ స్కూల్ హాస్టల్ వార్డెన్ వినోద్‌తో హాస్టల్ సమస్యలను అడిగి తెలుసుకున్నరు. హాస్టల్‌లో మౌలిక సదుపాయాల కల్పనకు నిధులను విడుదల చేయిస్తామన్నారు. కార్యక్రమంలో ఏపీఓ మంజునాథ, అసిస్టెంట్ ఇంజనీర్ రాజశేఖర్‌నాయుడు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

పెనుకొండ: పట్టణంలో శనివారం విద్యుత్ సరఫరాకు అంతరాయం ఉంటుందని ట్రాన్స్‌కో ఏఈ నారాయణస్వామి తెలిపారు. విద్యుత్ లైన్ల అత్యవసర మరమ్మతుల కారణంగా ఉదయం 9:30 గంటల నుంచి మధ్యాహ్నం 1:30 గంటల వరకూ విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందన్నారు. దీన్ని గమనించి పెనుకొండ పట్టణ విద్యుత్ వినియోగదారులు సహకరించాలని కోరారు.

లేపాక్షి: మండలంలోని శిరివరం 33/11కేవీ సబ్‌స్టేషన్ ఫీడర్ లైన్‌లో మరమ్మతుల కారణంగా శనివారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని ఏఈ వెంకటేశులు తెలిపారు. ఉదయం 10 గంటల నుంచి 12 గంటల వరకూ అంతరాయం ఉంటుందన్నారు. శిరివరం, కోడిపల్లి, తిరుమలదేవరపల్లి, గోపిందేవరపల్లి, గౌరిగానపల్లి, విబూతిపల్లి, మానేపల్లి, నాగేపల్లి గ్రామాలకు విద్యుత్ నిలిపివేస్తున్నామని, వినియోగదారులు సహకరించాలని కోరారు.

హిందూపురం: పట్టణ పరిధిలోని 220/132/33కేవీ విద్యుత్ ఉపకేంద్రం, సేవామందిరం వద్ద అత్యవసర మరమ్మతుల కారణంగా శనివారం ఉదయం 9.30 గంటల నుంచి మధ్యాహ్నం 1.30 గంటల వరకూ విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు విద్యుత్‌శాఖ అధికారులు తెలిపారు. వినియోగదారులు సహకరించాలని కోరారు.

ఉగ్రప్ప మృతికి నివాళి

రొళ్ల: మండల పరిధిలోని బంద్రేపల్లికి చెందిన కాంగ్రెస్ పార్టీ యువజన మాజీ అధ్యక్షుడు ఉగ్రప్ప (61) గురువారం రాత్రి మృతి చెందినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. విషయం తెలుసుకున్న సీడబ్ల్యూసీ మెంబర్ రఘువీరారెడ్డి, జెడ్పీటీసీ సభ్యుడు అనంతరాజు, మాజీ ఎమ్మెల్సీ గుండుమల తిప్పేస్వామి తదితరులు వేర్వేరుగా బంద్రేపల్లికి చేరుకుని ఉగ్రప్ప భౌతికకాయం వద్ద నివాళులర్పించారు.

అరుణాచలానికి బస్సు సౌకర్యం

పెనుకొండ: అరుణాచలం వెళ్లే భక్తులకు పెనుకొండ ఆర్టీసీ డిపో నుంచి బస్సు సౌకర్యం కల్పిస్తున్నట్లు డిపో మేనేజర్ రంగభాష్యం తెలిపారు. అరుణాచల దర్శనం, గిరి ప్రదక్షిణ అనంతరం అదేరోజు తిరుగు ప్రయాణం ఉంటుందన్నారు. పెద్దలకు రూ.1350, పిల్లలకు రూ.680 చార్జీ ఉంటుందన్నారు. వివరాలకు 9959229965, 7382860469 నంబర్లను సంప్రదించాలన్నారు.

సబ్సిడీతో దాణా పంపిణీ

లేపాక్షి: మండలంలోని శిరివరం గ్రామంలో పశుసంవర్ధకశాఖ ఆధ్వర్యంలో 50 శాతం సబ్సిడీతో రైతులకు దాణా పంపిణీ చేశారు. ఈ సందర్భంగా డిప్యూటీ డైరెక్టర్ పెంచలయ్య మాట్లాడుతూ పశువుల ఆరోగ్యం, ఉత్తపత్తిని కాపాడడానికి రాయితీపై పశువులకు నాణ్యమైన సమీకృత దాణా సరఫరా చేస్తున్నామన్నారు. రేషన్ కార్డు కలిగిన పాడిరైతులకు 50 కిలోల బస్తా రూ. 1110కు పంపిణీ చేస్తున్నామన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ నేత్రావతి, డాక్టర్ హేమలత తదితరులు పాల్గొన్నారు.

చిలమత్తూరులో వాన

చిలమత్తూరు: మండలంలో గత రెండు రోజులుగా మోస్తరు నుంచి భారీ వర్షాలు కురుస్తున్నాయి. రుతుపవనాల ప్రభావంతో శుక్రవారం పగలు, సాయంత్రం సుమారు గంట పాటు వర్షం కురిసింది. దీంతో వాతావరణం పూర్తిగా చల్లగా మారింది. రైతులు ఇప్పటికే ఖరీఫ్ సాగు కోసం సేద్యం పనులు మొదలు పెట్టారు.

వ్యాపారులకు సదుపాయలు కల్పించండి

హిందూపురం: హిందూపురం వ్యవసాయ మార్కెట్ కమిటీ ప్రత్యేక శ్రేణి కార్యదర్శిగా నియమితులైన నరసింహమూర్తిని శుక్రవారం మండి మర్చెంట్స్ అసోసియేషన్ సభ్యులు కలిశారు. మార్కెట్ అభివృద్ధి కృషి చేస్తూ సమస్యలు పరిష్కరించాలని కోరారు. కార్యక్రమంలో మర్చంట్స్ అసోసియేషన్ అధ్యక్షుడు కే.పీ శ్రీకాంత్, కార్యదర్శి ఎం.పీ.దీపక్, ఉపాధ్యక్షులు పి.శ్యాంబాబు, కోశాధికారి ఆదిశేషు, సహకార్యదర్శి నాగనిఖిల్, సభ్యులు మల్లికార్జున తదితరులు పాల్గొన్నారు.